## రామయ్యకు రాజఖడ్గం, డాలు సమర్పణ

భద్రాచలం, జనవరి 6: భద్రాచలం సీతారామచంద్రస్వామివారికి జగద్గురు శ్రీమాన్ మధ్వాచార్య మూల మహాసంస్థానం శ్రీమద్ ఉత్తరాది మఠాధీశులు, శ్రీ1008 శ్రీసత్యాత్మతీర్థ శ్రీపాదుల వారు శనివారం రూ.3.10 లక్షల విలువైన రాజ ఖడ్గం, డాలు సమర్పించారు. అనంతరం బేడా మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. రాజఖడ్గానికి, డాలుకు కూడా పూజలు నిర్వహించారు. అనంతరం వాటిని దేవస్థానం ఈవో రమాదేవికి అందజేయగా వాటిని స్వామివారికి అలంకరించారు.


దేవస్థానం ఈవోకు కత్తి, డాలును అందజేస్తున్న ఉత్తరాది మఠాధీశులు సత్యాత్మతీర్థ శ్రీపాదులు

## గోటి తలంబ్రాల వడ్లకు పూజలు

భద్రాచలం, జనవరి 6 : భద్రాచలం సీతారామచంద్రస్వామికి శ్రీరామ నవమి రోజున కల్యాణంలో గోటి తలంబ్రాలు(గోటితో ఒలిచిన) సమర్పించేందుకు ఖమ్మంకు చెందిన శ్రీరామ భక్తులు రామాలయంలో శనివారం వడ్లకు పూజలు చేపట్టారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి అర్చకులచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏప్రిల్ 17న జరిగే శ్రీరామ నవమికి గోటి తలంబ్రాలను సిద్ధం చేసేందుకు వడ్లకు పూజలు చేసినట్లు వారు పేర్కొన్నారు.


వడ్లకు పూజలు చేస్తున్న ఖమ్మంకు చెందిన రామ భక్తులు

# ప్రజాపాలనకు భారీగా దరఖాస్తులు

- ఖమ్మం జిల్లావ్యాప్తంగా ముగిసిన గ్రామసభలు
- ఆరు గ్యారెంటీలకు 5,49,852 దరఖాస్తులు


చింతకానిలో దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీవో

ఖమ్మం, జనవరి 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): గత నెల 28 నుంచి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా జరిగిన ప్రజాపాలన కార్యక్రమాలు శనివారంతో ముగిశాయి. గ్రామాలు, వార్డుల నుంచి 5,49,852 దరఖాస్తులు అందాయి. దరఖాస్తులను అధికారులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తున్నారు. ఆన్‌లైన్ నమోదుకు ప్రభుత్వం డేటా ఎంట్రీ ఆపరేటర్లు, అధికారులకు రెండు రోజుల పాటు శిక్షణ ఇచ్చింది. అత్యధిక దరఖాస్తులు రూ.500కు గ్యాస్ సిలిండర్, మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు నెలకు రూ.2,500 పంపిణీకి వచ్చాయని తెలుస్తోంది. ప్రజాపాలన సభల వద్ద ప్రత్యేక బృందాలు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాయి. వారి సందేహాలను హెల్ప్ డెస్క్‌లు నివృత్తి చేశాయి.

**పర్యవేక్షణ ఇలా..**

ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో చేపట్టిన ప్రజాపాలన సభల పర్యవేక్షణకు ప్రత్యేకాధికారిగా సీనియర్ ఐఏఎస్ అధికారి, రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ రఘునందన్‌రావు నియమితులయ్యారు. ఆయన తొలిరోజు నుంచే గ్రామాలు, పట్టణస్థాయిలో గ్రామసభలను పరిశీలించారు. మధిర, ఎర్రుపాలెం మండలాల్లో ప్రజాపాలన గ్రామసభలకు డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క హాజరయ్యారు. పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్ మండలాల్లో జరిగిన సభలను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు. రఘునాథపాలెం మండలంతో పాటు ఖమ్మం నగరంలోని పలు డివిజన్లలో జరిగిన ప్రజాపాలన సభలకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. దరఖాస్తుదారుల సందేహాలను నివృత్తి చేశారు.

**తొలుత గందరగోళం..**

ప్రజాపాలన దరఖాస్తులపై ప్రజలు తొలి రెండు, మూడు రోజుల్లో గందరగోళానికి గురయ్యారు. ప్రస్తుతం వృద్ధాప్య, వితంతు, దివ్యాంగుల పెన్షన్ పొందే వారు దరఖాస్తు చేసుకోవాలా? వద్దా? అనే అంశంపై దరఖాస్తుదారుల్లో అయోమయం కనిపించింది. అలాగే మహాలక్ష్మి, రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, చేయూత పథకాల దరఖాస్తుల్లోనూ దరఖాస్తుదారులకు అనేక సందేహాలు తలెత్తాయి. తెల్లరేషన్ కార్డు లేని వారు తొలుత దరఖాస్తు చేసుకోవడానికి సందేహించారు. దరఖాస్తు ఫారంలో తెల్ల రేషన్ కార్డు జిరాక్స్ పత్రం జత చేయాలని అధికారులు చెప్పడంతో కార్డు లేని వారు నిరాశకు గురయ్యారు. తర్వాత రేషన్ కార్డు లేకపోయినా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పడంతో తిరిగి దరఖాస్తు చేసుకోవడం ప్రారంభించారు.

## భద్రాద్రి జిల్లా దరఖాస్తులు 3,33,370

భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారెంటీ దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం శనివారం సాయంత్రంతో ముగిసింది. గత నెల 28న కార్యక్రమం ప్రారంభం కాగా.. జిల్లావ్యాప్తంగా 481 గ్రామ పంచాయతీలు, 4 మున్సిపాలిటీల్లో ప్రజా పాలన గ్రామసభలు నిర్వహించారు. మండలానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించి గ్రామ సభలు చేపట్టారు. ప్రతి రోజూ మూడు బృందాలు.. పది కౌంటర్లను ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అయితే దరఖాస్తుదారులు ఆధార్ అప్‌డేట్, గ్యాస్ ఈ-కేవైసీ నమోదు విషయంలో గందరగోళంలో పడ్డారు. వారి సమస్యలను నివృత్తి చేసేందుకు అధికారులు సైతం తికమకపడ్డారు. కాగా.. 481 గ్రామ పంచాయతీలు..104 మున్సిపల్ వార్డుల్లో 3,33,370 దరఖాస్తులు వచ్చాయి.

**ఆన్‌లైన్ ప్రక్రియలో నిమగ్నం**

ఆరు గ్యారెంటీ దరఖాస్తుల స్వీకరణ పూర్తి కావడంతో ఆన్‌లైన్ ప్రక్రియకు అధికారులు శ్రీకారం చుట్టారు. కలెక్టర్ ప్రియాంక ఆల వీసీ ద్వారా ప్రత్యేకాధికారులకు దరఖాస్తుల ఆన్‌లైన్ విధానంపై దిశానిర్దేశం చేశారు. అంతకుముందే ఆన్‌లైన్ చేసే ఆపరేటర్లకు శిక్షణ సైతం ఇచ్చారు. ఎంపీడీవోలు, తహసీల్దార్లు ఆయా మండల కార్యాలయాల్లో ప్రత్యేక కంప్యూటర్లను ఏర్పాటు చేసి దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్నారు. ఈ నెల 17వ తేదీ నాటికి ఆన్‌లైన్ పూర్తి చేయాలని కలెక్టర్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు.


ప్రజా పాలన గ్రామసభలో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న అధికారులు

- పంట ఉత్పత్తుల నాణ్యతా ప్రమాణాలు గాలికి
- చేతులతో తడిమి ధర నిర్ణయిస్తున్న ఖరీదుదారులు
- మిర్చి విక్రయాల్లో తీవ్రంగా నష్టపోతున్న రైతాంగం
- మార్కెట్‌లో ఆధునిక యంత్రాలున్నా వినియోగించని దుస్థితి
- ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారాజ్యం
- శాస్త్రీయ పద్ధతి పాటించాలి : అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్


మిర్చి యార్డుకు రైతులు తీసుకొచ్చిన మిర్చి బస్తాలు(ఫైల్)

# అటకెక్కిన యంత్రం.. చేతిలోనే మంత్రం!

ఖమ్మం వ్యవసాయం, జనవరి 6 : వ్యవసాయ మార్కెట్‌లో పంట ఉత్పత్తుల నాణ్యతను నిర్ధారించేందుకు మార్కెటింగ్ శాఖ సాంకేతిక పరిజ్ఞానాన్ని తెచ్చినా క్షేత్రస్థాయిలో ఆచరణలో పెట్టడం లేదు. దీంతో పంట నాణ్యతా ప్రమాణాలు, తేమ శాతాన్ని వ్యాపారులు చేతులతోనే నిర్ధారిస్తుండడంతో ఆరుగాలం పంట పండించిన రైతులకు గిట్టుబాటు ధర లభించక తీవ్రంగా నష్టపోవాల్సి వస్తున్నది. ఏటా ధర విషయంలో ఖరీదుదారుల దయాదాక్షిణ్యాలపైనే ఆధారపడాల్సి వస్తున్నది. దీనిపై మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పంట కొనుగోలు చేసిన ఖరీదుదారులు సొమ్ము చేసుకుంటుండగా.. రైతులు మద్దతు ధర పొందలేని పరిస్థితి నెలకొన్నది.

**పొరుగు జిల్లాల నుంచి విక్రయానికి..**

రాష్ట్రంలోనే అతిపెద్ద మార్కెట్లలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ఒకటి. జిల్లా రైతాంగంతోపాటు పొరుగున ఉన్న మహబూబాబాద్, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లా నుంచి రైతులు తమ పంట ఉత్పత్తులను తీసుకొచ్చి విక్రయిస్తుంటారు. ఈ క్రమంలో రైతులు, వ్యాపారులు, కార్మికుల సౌకర్యార్థం మార్కెట్‌లో సాంకేతిక పరిజ్ఞానాన్ని గతంలోనే అందుబాటులోకి తెచ్చారు. నిరంతరం సీసీ పుటేజీల పర్యవేక్షణ, జీపీఆర్‌ఎస్ కాంటాలు, పత్తి క్రయ విక్రయాల్లో ఈ-నామ్ విధానం, మిర్చి విక్రయాల్లో సైతం ఈ-టామ్ విధానం అమల్లోకి తీసుకొచ్చారు. దీంతో మార్కెట్‌లోని అన్ని యార్డుల్లో పూర్తిస్థాయిలో ఆధునిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చినట్లైంది. అంతేకాక యార్డుకు రైతులు తీసుకొచ్చిన పంట ఉత్పత్తుల నాణ్యతా ప్రమాణాలు, తేమ శాతం తెలుసుకొని సీసీఐ తేమ శాతం నిర్ధారణ యంత్రాలతో కొనుగోళ్లు చేపడుతుండగా.. ధాన్యం కొనుగోళ్లలో సైతం తేమ శాతం నిర్ధారణ యంత్రాలను వినియోగిస్తూ గ్రేడింగ్ చేసి అందుకనుగుణంగా కొనుగోళ్లు చేపడుతున్నారు. ఇక ఎండు మిర్చిని సైతం పంట నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఖరీదుదారులు ధర నిర్ణయించి కొనుగోలు చేయాల్సి ఉండగా.. చేతులతోనే పంటను తడిమి చూసి తమకు నచ్చిన రేటు నిర్ణయించి కొనుగోలు చేయడం పరిపాటిగా మారింది. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో రైతులు తమ పంటను అమ్ముకోవాల్సి వస్తున్నది.

**స్టోర్‌రూంలోనే యంత్ర పరికరాలు**

మిర్చి పంటను రైతులు ఏటా నవంబర్ మొదలుకొని ఏప్రిల్ వరకు విక్రయానికి ఖమ్మం మార్కెట్‌కు తీసుకొస్తుంటారు. దిగుబడులు మంచిగా ఉండడం.. సరుకు ఎక్కువగా మార్కెట్‌కు వస్తుండడంతో గిట్టుబాటు ధర అందించేందుకు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే మిర్చి పంట నాణ్యత ప్రమాణాల పరిశీలన కోసం యంత్రాలను అందుబాటులోకి తెచ్చింది. మూడు యంత్రాల కొనుగోలుకు రూ.36 లక్షలు వెచ్చించి మార్కెట్‌కు అందజేసింది. అయితే యంత్రాలు మార్కెట్‌కు వచ్చిన ఆరంభంలో ఒకటి రెండుసార్లు మినహాయించి తర్వాత వాటిని వినియోగించిన దాఖలాలే లేవు. లాట్‌లు ఎక్కువగా వస్తున్నందున నాణ్యతా ప్రమాణాలు చూడడం కుదరడం లేదని అధికారులు పేర్కొంటున్నారు. అయితే ఖరీదుదారులు కావాలనే యంత్రాలను వాడుకలోకి తేకుండా అడ్డుకుంటున్నారనే విమర్శలు ఉన్నాయి. సదరు యంత్రాలను వాడుకలోకి తీసుకొచ్చినట్లైతే పంట నాణ్యత తెలియడంతోపాటు రైతులకు ధర గిట్టుబాటు అయ్యే అవకాశం ఉన్నది.

### శాస్త్రీయ పద్ధతి పాటించాలి : అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

శాస్త్రీయ పద్ధతిలోనే మిర్చి నాణ్యతను పరిశీలించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం మార్కెట్‌ను సందర్శించిన ఆయన తొలుత సెక్రటరీ చాంబర్‌లో ఇంచార్జి సెక్రటరీ, గ్రేడ్-టూ అధికారి బజార్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎంఏ.అలీంతో సమావేశమయ్యారు. యార్డుకు వస్తున్న మిర్చి బస్తాలు, రైతులకు అందుతున్న మద్దతు ధర తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం మిర్చి యార్డులో నిల్వ ఉన్న బస్తాల్లోని పంటను పరిశీలించారు. పంట నాణ్యతను ఎలా నిర్ధారిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. లాట్ వద్దే జెండా పాట పెడుతున్నామని, మిగిలిన లాట్‌లకు ఖరీదుదారులు చెప్పిన రేటు ప్రకారంగా ధరలు ఉంటున్నాయని అధికారులు తెలిపారు. అయితే ఆ పద్ధతి సరికాదని, శాస్త్రీయ విధానంలోనే నాణ్యతను నిర్ధారణ చేయాలన్నారు. మార్కెట్‌లోని యంత్రాలను వాడుకలోకి తేవాలన్నారు. లక్షలాది రూపాయలతో కొనుగోలు చేసిన యంత్రాలను పక్కన పడేయడం పట్ల అదనపు కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.


యార్డుకు వచ్చిన పంటను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

# తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యాన్ని స్థాపిస్తాం

**డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క**

మధిర, జనవరి 6: రాష్ట్రంలో దోపిడీకి తావు లేకుండా తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యాన్ని స్థాపిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడు జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమాన్ని ఖమ్మం కలెక్టర్ వీ పీ గౌతమ్, సీపీ సునీల్‌దత్‌తో కలిసి పర్యవేక్షించి మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చే లక్ష్యంతోనే కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించిందన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రజల కోసం తమ పార్టీ ఎన్నో సేవలను అందించిందని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే తమ ప్రభుత్వం మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించిందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని మెరుగు పరిచేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. సృష్టించిన సంపదను ప్రజలకు అందజేసేందుకు పనిచేస్తామని స్పష్టం చేశారు. యువత కలలు, ఆశలను నిజం చేస్తామని, స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా వారికి ఉపాధి కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ విద్యుత్ ఉత్పత్తిపై అధ్యయనం చేస్తున్నామన్నారు. మానవ వనరులపై పెట్టుబడి పెట్టే ఉద్దేశంతో ప్రతి మండల కేంద్రంలో ఒక ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేస్తామన్నారు. అందుకు ఇప్పటికే మండల కేంద్రాల్లో భూసేకరణ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దేవరకొండ శిరీష, సర్పంచ్ పుల్లారెడ్డి, ఆర్డీవో గణేష్, జడ్పీ సీఈవో వింజం అప్పారావు పాల్గొన్నారు.


దరఖాస్తులను పరిశీలిస్తున్న డిప్యూటీ సీఎం

# దిగుబడికి అనుగుణంగా ఫ్యాక్టరీలు

- సాగు విస్తరణకు సరిపడా ఆయిల్‌పామ్ మొక్కలు
- విలేకరుల సమావేశంలో ఆయిల్‌ఫెడ్ ఎండీ సురేందర్


ఫ్యాక్టరీ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఆయిల్‌ఫెడ్ ఎండీ సురేందర్

అశ్వారావుపేట, జనవరి 6 : ఆయిల్‌పామ్ గెలల దిగుబడికి అనుగుణంగా ఫ్యాక్టరీల నిర్మాణం చేపడుతున్నట్లు ఆయిల్‌ఫెడ్ ఎండీ సురేందర్ స్పష్టం చేశారు. అశ్వారావుపేట ఫ్యాక్టరీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో కొత్త సాగుతో మొత్తం 89 వేల ఎకరాల్లో ఆయిల్‌పాం సాగవుతుందన్నారు. వచ్చే ఏడాది మరో 20 వేల ఎకరాల్లో సాగు విస్తరణకు ప్రణాళిక సిద్ధం చేశామని, ఇందులో ఉమ్మడి జిల్లాలోనే 15 వేల ఎకరాల్లో సాగు విస్తరించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతానికి మొక్కల కొరత లేదని, ఆయిల్‌ఫెడ్ పరిధిలో 11 నర్సరీల ద్వారా మొక్కల ఉత్పత్తి కొనసాగుతున్నదన్నారు. కొత్త ప్లాంటేషన్ల నుంచి లభించే దిగుబడులకు అనుగుణంగా కొత్త ఫ్యాక్టరీల నిర్మాణం చేయనున్నట్లు వివరించారు. ఇప్పటికే అప్పారావుపేట ఫ్యాక్టరీని 90, అశ్వారావుపేట ఫ్యాక్టరీని 30 టన్నుల సామర్థ్యానికి పెంచినట్లు చెప్పారు. అలాగే సిద్దిపేట ఫ్యాక్టరీతోపాటు ఖమ్మం జిల్లా కల్లూరిగూడెంలో 2026 నాటికి మరో ఫ్యాక్టరీని రైతులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. ఈ ఏడాది ఆయిల్ ఇయర్‌లో ఫార్ములాను 19.02 శాతంగా నిర్ణయించామని, గత ఏడాది 19.32 శాతం ఉన్న ఫార్ములా తగ్గడానికి అనేక కారణాలు ఉన్నాయని తెలిపారు. కాగా.. ఆయిల్‌ఫెడ్ ఎండీ సురేందర్ అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో పర్యటించారు. అప్పారావుపేట ఫ్యాక్టరీలో ఎంఈఈ ప్లాంట్, 90 టీపీహెచ్, 30 టీపీహెచ్ బాయిలర్ పనులను తనిఖీ చేశారు. అనంతరం నర్సరీని సందర్శించిన ఆయన మొక్కల నాణ్యతను పరిశీలించి పంపిణీ ప్రక్రియను పెంచాలని, అడిగిన రైతులందరికీ మొక్కలు సరఫరా చేయాలని ఆదేశించారు. అక్కడ నుంచి అశ్వారావుపేట ఫ్యాక్టరీకి చేరుకుని రెండో ఫ్యాక్టరీ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఆయన వెంట ఆయిల్‌ఫెడ్ జీఎం టి.సుధాకర్‌రెడ్డి, పీఅండ్‌పీ మేనేజర్లు శ్రీకాంత్‌రెడ్డి, జెన్ను సత్యనారాయణ, ఆయిల్‌ఫెడ్ డివిజనల్ ఆఫీసర్ ఆకుల బాలకృష్ణ, దమ్మపేట ఫ్యాక్టరీ మేనేజర్ కళ్యాణ్ తదితరులు ఉన్నారు.


నారు తీస్తున్న వ్యవసాయ కూలీలు


ఆరబెట్టిన వానకాలం పంట ధాన్యం


కొనుగోలు కేంద్రాలకు తరలించేందుకు సిద్ధంగా ఉంచిన ధాన్యం

- నీళ్ల కరువు తీరడంతో వరి నాట్లు వేస్తున్న ఏజెన్సీ రైతులు
- వానకాలం ధాన్యం విక్రయించకముందే మొదలైన నాట్లు


నాట్లు వేస్తున్న మహిళా కూలీలు

# నాటి ప్రభుత్వ ప్రయత్నాలు.. నేడు ప్రజలకు ఫలాలు..

చర్ల, జనవరి 6 : నాడు కేసీఆర్ ప్రభుత్వం చేసిన భగీరథ ప్రయత్నాలు అప్పుడే ఫలించాయి. వాటి ఫలాలను ప్రజలు ఏటా అందుకుంటూనే ఉన్నారు. ముఖ్యంగా రైతుల కోసం మిషన్ కాకతీయ దగ్గర నుంచి సాగునీటి వనరుల కల్పన దాకా కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సంకల్పాలన్నీ నెరవేరాయి. దీంతో గడిచిన పదేళ్లుగా రైతులు వాటి ఫలాలు ఆస్వాదిస్తూనే ఉన్నారు. పల్లెల్లోని పంట పొలాల్లో ప్రస్తుతం కన్పిస్తున్న సందడి చూస్తుంటే కర్షకుల కోసం నాటి కేసీఆర్ ప్రభుత్వం చేసిన ముందుచూపు ఆలోచనలు ఏంటో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. పదేళ్ల క్రితం వరకూ ఒక్క పంటకు కూడా సాగునీరు నోచుకోని ఏజెన్సీ పొలాలు నేడు రెండు పంటలతో కళకళలాడుతున్నాయి. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలు, మరమ్మతులు, మిషన్ భగీరథతో చెరువుల పునరుద్ధరణ కారణంగా నేడు జల వనరుల్లో సాగునీళ్లు పుష్కలంగా ఉన్నాయి. ముఖ్యంగా చర్ల మండల రైతులు సాగునీటి వనరుల కింద ఏటా రెండు పంటలను సాగు చేస్తున్నారు. దీంతో ఈ ప్రాంతం ఏజెన్సీకి ధాన్యాగారంగా మారింది. ఇదే క్రమంలో ఈ ఏడాది మొదటి పంట అయిన వానకాలం పంట ఇటీవలే రైతుల చేతికొచ్చింది. ఆ పంటను కల్లాల్లోనూ, కొనుగోలు కేంద్రాల్లోనూ పెట్టి విక్రయానికి సిద్ధంగా ఉంచిన రైతులు.. యాసంగికి కూడా అప్పుడే శ్రీకారం చుట్టారు. అధికారుల గణాంకాల ప్రకారం.. చర్ల మండలంలో ఈ యాసంగిలో ఆరు వేల ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేస్తున్నారు. అనేక గ్రామాల్లో రైతులు వరి నాట్లను పూర్తి చేస్తున్నారు. వ్యవసాయం, రైతాంగం పట్ల కేసీఆర్ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి ఈ చిత్రాలే నిదర్శనాలు.

## బాధ్యతలు స్వీకరించిన భద్రాద్రి ఎస్పీ

**బదిలీపై వెళ్తున్న వినీత్ గంగన్నకు ఘనంగా వీడ్కోలు**

కొత్తగూడెం క్రైం, జనవరి 6 : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీగా బదిలీపై వచ్చిన బిరుదరాజు రోహిత్ రాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి నుంచి హైదరాబాద్‌లోని మాదాపూర్ డీసీపీగా బదిలీపై వెళ్తున్న డాక్టర్ వినీత్ గంగన్నకు జిల్లాలోని పోలీస్ అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. బదిలీపై వచ్చిన రోహిత్ రాజుకి వినీత్ గంగన్న బాధ్యతలు అప్పగించారు. అనంతరం జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచి పుష్పాలతో అలంకరించిన రథాన్ని వినీత్ గంగన్న అధిరోహించగా.. అధికారులంతా తాడుతో లాగుతూ ఊరేగింపుగా తీసుకెళ్లి ఘనంగా సాగనంపారు. అలాగే ఎస్పీగా రోహిత్ రాజు బాధ్యతలు స్వీకరించడం పట్ల అధికారులంతా హర్షాతిరేకలు వ్యక్తం చేస్తున్నారు. ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన రోహిత్ రాజుని పోలీస్ అధికారులు, సిబ్బంది గౌరవప్రదంగా కలిసి ఘనంగా సత్కరించారు. ఇద్దరు ఉన్నతాధికారులను సత్కరించిన కార్యక్రమంలో అదనపు ఎస్పీ(ఆపరేషన్స్) టి.సాయి మనోహర్, ఏఆర్ అదనపు ఎస్పీ విజయ్‌బాబు, ఏఎస్పీ పంకజ్ పరితోష్, డీఎస్పీలు షేక్ అబ్దుల్ రెహమాన్, కేవీ.రమణమూర్తి, ఎన్.వెంకటేశ్, మల్లయ్యస్వామి, ఏ.కృష్ణయ్య, అన్ని విభాగాల ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు, ఎస్సైలు, ఆర్‌ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.


వినీత్ గంగన్నకు రథంలాగి వీడ్కోలు పలుకుతున్న నూతన ఎస్పీ రోహిత్‌రాజు, పోలీస్ అధికారులు

### ఓటర్ల ముసాయిదా వెల్లడి
**వచ్చే నెల 8న తుది జాబితా ప్రకటన : కలెక్టర్**



భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 6 (నమస్తే తెలంగాణ) : కొత్త ఓటర్ల నమోదు, చేర్పులు, మార్పుల ముసాయిదాను భద్రాద్రి జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల శనివారం వెల్లడించారు. జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే నిర్దేశించిన ఫార్మాట్‌లో తెలియజేయాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో మొత్తం 9,72,858 ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. ఇందులో పురుషులు 4,74,520 మంది ఉండగా.. మహిళలు 4,98,290 మంది, ట్రాన్స్‌జెండర్లు 48 మంది ఉన్నట్లు తెలిపారు. కాగా.. ఎన్‌ఆర్‌ఐలు 34, సర్వీసు ఓటర్లు 728 మంది ఉన్నట్లు గుర్తించామన్నారు. ముసాయిదా ఓటరు జాబితాను ప్రతి ఓటరూ పరిశీలించి అభ్యంతరాలు, తప్పులు, సవరణలు ఉంటే ఈ నెల 22 వరకు పూర్తి చేసి దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వాటిపై ఫిబ్రవరి 2వ తేదీ వరకు విచారణ చేసి.. 8న తుది జాబితా ప్రకటించనున్నట్లు తెలిపారు. కొత్త ఓటరు నమోదుకు ఫారం-6, తప్పొప్పులకు ఫారం-8, ఓటరు జాబితాలో పేర్లపై ఆక్షేపణలకు ఫారం-7లో వివరాలు తెలియజేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.